1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 30 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 31 జనవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 30 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 31 January 2026 PAGES : 8 PRICE : 3/-


## ప్రపంచ ఆశాకిరణం భారత్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జనవరి 30)

ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్న భారతదేశం ఇప్పుడు ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన ప్రజాస్వామ్యం, జనసంఖ్య పరంగా మనకున్న బలం ప్రపంచానికి గొప్ప ఆశాభావాన్ని కలిగిస్తోందని చెప్పారు. ఐరోపా సమాఖ్య (ఈయూ)తో ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బృహత్తరమైనదని, దేశంలోని తయారీదారులకు దీనిద్వారా మరిన్ని అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. వీటిని వారు అందిపుచ్చుకుని సామర్థ్యాన్ని పెంచుకోవాలని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం గురువారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "పారిశ్రామిక దిగ్గజాలు, తయారీదారులు ఎలాంటి ఉదాసీనతకు తావులేకుండా ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి సారించాలి. ఈయూలోని 27 దేశాల్లో మనం అత్యుత్తమ నాణ్యతతో ఉత్పత్తుల్ని విక్రయించి లాభాలతోపాటు అక్కడివారి మనసుల్లో చోటు దక్కించుకునేందుకు అవకాశం ఉంది. అది దశాబ్దాలపాటు మన బంధాలపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. దేశం పేరుతో పాటు ఉత్పత్తి పేరు గర్వకారణంగా నిలుస్తుంది. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై మనదేశం వేగంగా దూసుకుపోతోంది. సంస్కరణల ఆవిష్కరణలో ఎంపీలు సానుకూలంగా తమవంతు కృషి చేస్తున్నారు. వారికి నా కృతజ్ఞతలు. -మిగతా 2లో

## సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించాలి: చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 30)

ఆర్థిక అసమానతలు తగ్గితేనే సమాజం బాగుంటుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు."మనం మాత్రమే కాదు.. సమాజం కూడా బాగుండాలనేది మన సంస్కృతి. అనేక సేవా కార్యక్రమాలకు ముందుకొచ్చి -మిగతా 2లో

## మహాపాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైకాపా నేతల విషప్రచారం

### - మంత్రి సుభాష్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 30)

తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో వైకాపా చేస్తోన్న తప్పుడు ప్రచారాలపై మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. -మిగతా 2లో

## భవిష్యత్ భారత్
## ఎలా ఉంటుందో.. విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 30)

భవిష్యత్ భారతదేశం ఎలా ఉండబోతోందనే అంశంపై విద్యార్థులు కూడా అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలంలో అగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీచర్ల ట్రైనింగ్ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. రూ.3 కోట్ల వ్యయంతో 11 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఏడాదికి 5 వేల మంది టీచర్లు, స్కూల్ లీడర్లను తీర్చిదిద్దేలా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం అకాడమీ ప్రాగంణంలోనే లెర్నర్స్ అకామిడేషన్ ఫెసిలిటీ సెంటర్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారు.



ఈ సందర్భంగా ఆగస్త్య అకాడమీ ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. "ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిణామాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి. అలా అందిపుచ్చుకోవడం వల్లే ఐటీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వాళ్లు విస్తరించారు. అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశాను.. ఇప్పుడు ఏఐ గురించి అందరూ ఆలోచన చేయాలని చెబుతున్నా. విద్యార్థులు ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి.. భవిష్యత్ మనదే. రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త ఆవిష్కరణలు వస్తాయి. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్ కంపెనీలకు అవకాశాలు దక్కేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టాం. డ్రోన్, స్పేస్ సిటీ వంటి వాటితో ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు.. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను గమనించాలి. విద్యుత్ రంగంలో మార్పులు వస్తున్నాయి.. అందుకే విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించగలిగాం. టెక్నాలజీ అందిపుచ్చుకుంటే -మిగతా 2లో

## వన్యప్రాణుల సంరక్షణకు ముందుకు రావాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు
- విశాఖ జూ సందర్శన
- రెండు జిరాఫీల దత్తత
- జూలో జిరాఫీలకు ఆకులు తినిపిస్తున్న పవన్ కల్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 30)

వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పర్యావరణ సమతౌల్యతను కాపాడడంలో వన్యప్రాణులు చాలా కీలకమని, -మిగతా 2లో

## అనధికార భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలి: నారాయణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 30)

అన్ని మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, స్ట్రీట్ లైట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా కమిషనర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. అనధికార భవనాలు, లేఅవుట్లు క్రమబద్ధీకరించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి లెగసీ వేస్ట్ పూర్తిగా తొలగించాలని స్పష్టం చేశారు. వీధి కుక్కలు, పందులతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనంతపురంలో జరుగుతున్న ప్రాంతీయ మున్సిపల్ కమిషనర్ల సదస్సుకు మంత్రి నారాయణ వర్చువల్‌గా పాల్గొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ విభాగం కొత్త వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు. 123 మున్సిపాలిటీలకు అనుసంధానం చేస్తూ ఇంటిగ్రేటెడ్ డ్యాష్ బోర్డుతో కొత్త వెబ్‌సైట్ రూపొందించారు. మున్సిపాలిటీలకు సంబంధించిన పూర్తి సమాచారంతో పాటు ఆన్‌లైన్ పేమెంట్స్ చేసేలా వెబ్‌సైట్ రూపొందించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చినందుకు డైరెక్టర్ విద్యుల్లతను మంత్రి అభినందించారు. సమావేశానికి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

## క్యూబాకు చమురు విక్రయిస్తే.. టారిఫ్‌లు విధిస్తా: ట్రంప్ హెచ్చరికలు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జనవరి 30)

క్యూబా లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ దేశానికి చమురు విక్రయించే ఏ దేశంపైనైనా టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ఆయన సంతకం కూడా చేశారు.

క్యూబా విషయంలో జాతీయ అత్యవసర పరిస్థితి కింద ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దేశ ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ఈ తాజా ఉత్తర్వులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి. ట్రంప్ తాజా చర్య మెక్సికో పై ఒత్తిడి పెంచనుంది. క్యూబా ప్రభుత్వం నుంచి దూరం కావాలని దానిపై ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవల మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ మాట్లాడుతూ.. క్యూబాకు చమురు రవాణాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, అమెరికా ఒత్తిడి కారణంగా ఈ నిర్ణయం తీసుకోలేదని ఆమె స్పష్టం చేశారు.

కెనడా విమానాలపై 50శాతం టారిఫ్‌లు..!

అమెరికా- కెనడాల మధ్య సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. కెనడా పై ట్రంప్ మరోసారి టారిఫ్‌ల బెదిరింపులకు పాల్పడ్డారు. అమెరికాలోకి దిగుమతయ్యే కెనడాకు -మిగతా 2లో

## తప్పుడు ప్రచారాలతో ప్రజలను వైకాపా మభ్యపెడుతోంది: మంత్రి లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 30)

తిరుమల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా గత వైకాపా ప్రభుత్వం వ్యవహరించిందని మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. టౌన్, వార్డు, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల కోసం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

"చేయకూడని పాపాలు చేసి.. తప్పుడు ప్రచారాలతో ప్రజలను వైకాపా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టే బాధ్యత తెదేపా కార్యకర్తలదే. కూటమిని చీల్చే కుట్ర జరుగుతోంది. దీనిని విడదీయడం ఎవరి తరం కాదు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. ఐక్యంగా దుష్ప్రచారాలను అడ్డుకోవాలి. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి. కూటమి నాయకుల మధ్య సఖ్యత అత్యంత ముఖ్యం" అని లోకేశ్ అన్నారు.



## జగన్ అధికారానికి తగరు

- మళ్లీ పాదయాత్ర అంటే ఎవరూ నమ్మరు
- రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ రక్షణ యాత్ర
- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 30)

'వైకాపా అధినేత జగన్‌కు అధికారం నప్పదు. తాను ముఖ్యమంత్రినైతే సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తానని చెప్పి, కల్తీ మద్యం ప్రవేశపెట్టి, మాఫియాను సృష్టించారు. రుషికొండను బోడిగుండు చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో నీటిపారుదల ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తానని చెప్పి మాట తప్పార'ని మాజీ సీఎం జగన్‌పై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'జగన్ ప్రజల్లో ఎప్పుడైనా తిరిగారా కనీసం వాళ్ల పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులకైనా అందుబాటులో ఉన్నారా ఎన్నికల ముందు సిద్ధం సభలు పెట్టి కొన్ని నెలలు తిరిగారు తప్పితే ఎప్పుడైనా కనిపించారా ఏడాదిన్నర తర్వాత చేసే పాదయాత్రకు ఇప్పుడు ప్రకటనలు ఎందుకు ఎవరిని మోసం చేద్దామని ఈ యాత్రలు ఉపాధి హామీ పథకాన్ని చంపేయకుండా -మిగతా 2లో

## పోరుమామిళ్లలో ప్రతిపాదిత భూమి సంయుక్త తనిఖీ



**(షణ్ముఖ వెలుగు, గోపవరం, జనవరి 30)**

పోరుమామిళ్ల మండలం ముసలరెడ్డిపల్లి గ్రామంలో ప్రతిపాదిత జూ (కాంపెన్సేటరీ అఫారెస్టేషన్) భూమిని శుక్రవారం సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి, చంద్రమోహన్, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, ప్రొద్దుటూరు మరియు కడప అటవీ డివిజన్‌కు చెందిన సునీల్ సంకేత్ గరుడ్ , పోరుమామిళ్ల తహశీల్దార్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి , డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, బద్వేల్ టి. రఘురామయ్య , పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజ్ అధికారి రామనాథరెడ్డి పాల్గొన్నారు. ప్రతిపాదిత భూమి స్థితిగతులు, సరిహద్దులు, భౌగోళిక పరిస్థితులు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

## దోమకాటు ప్రమాదకరం.. నివారణ చర్యలే ఉత్తమం



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 30)**

దోమకాటు వల్ల మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా నివారణ చర్యలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి. నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం బద్వేల్ మండలం ఆనంద నగర్ గ్రామంలో మలేరియా శాఖ ఆధ్వర్యంలో "ఫ్రైడే–డ్రైడే" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా సర్వే నిర్వహించి, జ్వర బాధితులను గుర్తించడం తో పాటు లార్వా సర్వే చేపట్టారు. లార్వా ఉన్న చోట్ల నీటిని తొలగించి, ఫ్రిడ్జ్‌లు, కూలర్లను పరిశీలించి శుభ్రతపై అవగాహన కల్పించారు. తడి ప్రాంతాలు, నీటి కుంటలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా టి. నరసింహారెడ్డి మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల పెరుగుదల నియంత్రించవచ్చని, తద్వారా భవిష్యత్తులో వ్యాధుల బారిన పడే అవకాశాలు తగ్గుతాయన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జబ్బులు వచ్చినట్లయితే ప్రభుత్వ ఆసుపత్రులు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 104 సేవలను వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్ధన్ రావు, సిహెచ్ఓ వీణ, వైద్య సిబ్బంది దీపిక, సునీత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 2 ఫలితాల్లో ఎంపికైన అర్షద్‌కు సత్కారం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 30)**

తాజాగా విడుదలైన గ్రూప్ 2 ఫలితాలలో ఏఎస్ఓ (జిఏడి)గా ఎంపికైన అర్షద్‌ను శుక్రవారం పొదిలి పట్టణానికి చెందిన పలువురు టిడిపి నాయకులు శాలువా కప్పి స్వీట్స్ అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమాంస, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మీగడ ఓబుల్‌రెడ్డి, 12వ వార్డు టిడిపి యువ నాయకులు షేక్ మౌలాలి, వాకా సుబ్బారెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డిలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

**మొదటి పేజీ తరువాయి**

## భవిష్యత్ భారత్ ఎలా ఉంటుందో.. విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

విద్యుత్ ఛార్జీలను తగ్గించవచ్చు. కుప్పంను ప్రయోగశాలగా చూస్తా.. ఇక్కడికి అన్ని రకాల టెక్నాలజీలు తెస్తున్నాం. హంద్రీ–నీవా ద్వారా కుప్పం వరకు నీళ్లు తెచ్చాం.. నీటి భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. నీటి సంరక్షణ విషయంలో అగస్త్య అకాడమీ ప్రతినిధులు వినూత్నంగా ఆలోచన చేయాలి. నీటి సంరక్షణ, నీటి సద్వినియోగం విషయంలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టు చేపడదాం" అని చంద్రబాబు తెలిపారు.

## పపంచ ఆశాకిరణం భారత్

రిఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్

ప్రజల జీవితాల్లోకి వెళ్లాలన్నదే ప్రభుత్వ ఆలోచన. సంస్కరించడం (రిఫార్మ్), పనిచేయడం (పెర్ఫార్మ్), మార్పు తీసుకురావడం (ట్రాన్స్‌ఫార్మ్)లో ప్రభుత్వ అసలు గుర్తింపు ఉంది. దీర్ఘకాల సమస్యల్ని వదిలించుకుంటూ శాశ్వత పరిష్కారాల కోసం పనిచేస్తున్నాం" అని మోదీ పేర్కొన్నారు.

## సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించాలి: చంద్రబాబు

భారీగా విరాళాలు అందిస్తున్నారు. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చైతన్యం పెరిగింది. సేవా కార్యక్రమాలకు చాలా మంది ముందుకొస్తున్నారు. చదువు అనేది గేమ్‌ఛేంజర్.. సరైన సమయంలో నిర్ణయాలు తీసుకోవాలి. భారత రత్నకు మారుపేరుగా మాజీ రాష్ట్రపతి కలాం నిలిచారు. సాధారణ కుటుంబంలో పుట్టినా.. ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉన్నత స్థితికి చేరుకుంటారు. సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించాలి. పీ4 కార్యక్రమానికి ముందుకురావాలి" " అని చంద్రబాబు అన్నారు.ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు నజీర్ అహ్మద్, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్ కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, బూర్ల రామాంజనేయులు ఉన్నారు.

## మహాపాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైకాపా నేతల విషప్రచారం

ఇచ్చిన క్లీన్‌చీట్‌ను.. సిట్ ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరమన్నారు. సిట్ పూర్తిస్థాయి నివేదిక వస్తే.. ఆ పార్టీ నేతలకు గుండెపోటులు వస్తాయన్నారు. "మహా పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైకాపా నేతలు విష ప్రచారం చేస్తున్నారు. తిరుమలపై జగన్, ఆయన బ్యాచ్ ఎందుకు కక్ష కట్టిందో చెప్పాలి. వైఎస్ కూడా ఐదు కొండలంటూ గతంలో భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. జగన్ డిక్లరేషన్ ఇవ్వకుండా ఆలయానికి వెళ్లటం, ప్రసాదాన్ని తక్కువ చేసి మాట్లాడటం, గుడికి వెళ్లకుండా సెట్టింగ్‌లు వేసుకోవటం అలవాటుగా పెట్టుకున్నారు. కరుణాకర్‌రెడ్డి మనుషులు ఖాళీ మద్యం బాటిళ్లు పెట్టి దొరికిపోయారు. కల్తీ జరిగిందని సిట్ నివేదికలో నిర్ధరణ అయినా సంబరాలా? ఇకనైనా దేవుడితో ఆటలాపితే వాళ్లకే మంచిది" అని మంత్రి హితవు పలికారు.

## వన్యప్రాణుల సంరక్షణకు ముందుకు రావాలి

వాటిని దత్తత తీసుకునేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకురావాలని, జంతు ప్రదర్శన శాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. గురువారం విశాఖ జంతు ప్రదర్శన శాలను సందర్శించిన పవన్ కల్యాణ్.. తన తల్లి అంజనాదేవి జన్మదినం సందర్భంగా రెండు జిరాఫీలను ఏడాది కాలానికి దత్తత తీసుకున్నారు. జూలో ఏర్పాట్ల గురించి తెలుసుకొని, అభివృద్ధికి ఉన్న అవకాశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. 'మా కుటుంబంలో అంతా జంతు ప్రేమికులే' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

నగరవనం ప్రారంభోత్సవంలో పవన్ కల్యాణ్, అధికారులు

### నగరవనం ప్రారంభం

జూలోని సీతాకోకచిలుకల పార్కును పవన్ కల్యాణ్ సందర్శించారు. కొన్ని సీతాకోకచిలుకలను కొత్త పార్కులోకి వదిలారు. నీటి ఏనుగుల సంరక్షణ ?లఅగురించి తెలుసుకున్నారు.

ఎలుగుబంటి ఎన్‌క్లోజర్‌ను ప్రారంభించారు. జింకల పార్క్, సింహాలు, పులులు, మకావ్ చిలుకలను తిలకించారు. ఏనుగులకు, జిరాఫీలకు ఆహారం పెట్టారు.

అనంతరం కంబాలకొండను సందర్శించి, కొత్తగా 50 ఎకరాల్లో అభివృద్ధి చేసిన నగరవనాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు, ఏపీ సీసీఎఫ్ శాంతిప్రియా పాండే, అటవీ అభివృద్ధి సంస్థ ప్రాంతీయ మేనేజర్ జ్యోతి, జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర పాల్గొన్నారు.

## క్యూబాకు చమురు విక్రయిస్తే.. టారిఫ్‌లు విధిస్తా: ట్రంప్ హెచ్చరికలు

చెందిన విమానాలపై 50శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. జార్జియా కేంద్రంగా పనిచేస్తున్న అమెరికాకు చెందిన గల్ఫ్‌స్ట్రీమ్ ఏరోస్పేస్ జెట్‌లను సర్టిఫై చేసేందుకు కెనడా నిరాకరించిందని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. దీన్ని వెంటనే సరిదిద్దుకోకపోతే.. టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. వీటిపై కెనడా ఇంకా స్పందించలేదు. కాగా.. ఇటీవల చైనాతో ట్రేడ్ డీల్‌పై ముందుకెళ్తే ఆ దేశ దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తానని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరోసారి హెచ్చరికలు చేయడం గమనార్హం.

## జగన్ అధికారానికి తగరు

కేంద్రానికి వ్యతిరేకంగా యాత్ర చేయొచ్చు కదా' అని నిలదీశారు. 'మనిషి నైజం తెలియాలంటే అధికారమిచ్చి చూడాలని అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ అన్నారు. జగన్‌కు అధికారం ఇస్తే, రాష్ట్రం ఏమైందో చూశాం. అతనిలో స్వార్థం తగ్గి, మంచితనం పెరిగే వరకు దేవుడు, ప్రజలు ఆశీర్వదించర'ని వ్యాఖ్యానించారు.

### ఉపాధి హామీని పునరుద్ధరించాల్సిందే

ఉపాధి హామీ పథకాన్ని మళ్లీ అమలు చేయాలన్న డిమాండ్‌తో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం బండ్లపల్లి నుంచి ఫిబ్రవరి 2న ఉపాధి హామీ రక్షణ యాత్ర ప్రారంభించనున్నట్లు షర్మిల వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల మీదుగా సాగే ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను కాంగ్రెస్ నేతలతో కలిసి ఆమె ఆవిష్కరించారు. 'ఇదే బండ్లపల్లిలో 20 ఏళ్ల క్రితం అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. దాని స్థానంలో తెచ్చిన వీబీ జీ రామ్ జీ బిల్లుకు రాష్ట్రంలోని కూటమి ఎంపీలు మద్దతిచ్చి, రాష్ట్ర వాటా నిధులు భరించడం భారమని కేంద్రానికి సీఎం చంద్రబాబు మొరపెట్టుకోవడం ద్వంద్వవైఖరి కాదా?' అని షర్మిల ప్రశ్నించారు.

## సంపూర్ణత అభియాన్ - 2.0 వందశాతం అమలు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 30)**




యాస్పిరేషనల్ బ్లాక్ కింద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమాన్ని 100% సంతృప్తితో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు. జిల్లాలో అమలు చేసే రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీ.పి. శ్రీనివాసులుతో కలిసి సమీక్షించారు. సిపిఓ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు యాస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎర్రగొండపాలెం బ్లాక్ ( మండలం ) ను ఈ పథకం కింద కేంద్రం ఎంపిక చేసిందన్నారు. మొత్తం 39 అంశాలలో అన్ని విధాలుగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం ఏటా ఆరు ఇండికేటర్లను లక్ష్యంగా నిర్దేశిస్తుందన్నారు. గత ఏడాది 100% సంతృప్తితో అభివృద్ధి సాధించడం ద్వారా కేంద్రం బంగారు పతకాన్ని ఇచ్చిందన్నారు. ఈ ఏడాది ఐసిడిఎస్ విభాగానికి నాలుగు, విద్య, పశుసంవర్ధక శాఖకు ఒక్కో ఇండికేటర్ ను లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీలలో చిన్నారుల ప్రవేశాలను గణనీయంగా పెంచి పోషకాహారం అందించటం, ఆయా కేంద్రాలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడం, పాఠశాలల్లో బాలికలకు పూర్తిస్థాయిలో టాయిలెట్లను అందుబాటులో ఉంచడం, వ్యాధుల బారిన పడకుండా పశువులకు పూర్తిస్థాయిలో టీకాలు వేయటం వంటి అంశాలను లక్ష్యంగా పేర్కొన్నట్లు చెప్పారు.

దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ మొదట విడతలో స్వర్ణ పతకం సాధించిన స్ఫూర్తితో రెండో విడతలోనూ పనిచేయాలన్నారు. కేంద్రం నిర్దేశించినట్లుగా ఈ ఆరు ఇండికేటర్లలో ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీలోగా 100% సంతృప్తి సాధించేలా ఇప్పటినుంచే దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమ నోడల్ ఆఫీసర్ అయిన ఎర్రగొండపాలెం ఎంపీడీవో శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఈ సందర్భంగా కలెక్టర్ ను కలిసి వివరించారు.




## చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన యసి సెల్ కార్యదర్శి కటికల

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 30)**

ఒంగోలు పార్లమెంటరీ వైసీపీ ఇన్చార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఒంగోలు పార్టీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఆయనకు యసి సెల్ కార్యదర్శి కటికల వెంకటరత్నం శాలువా కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధారాలు లేని అక్రమ మద్యం కేసులో అంతిమంగా కోర్టులో న్యాయం గెలిచిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆనందాన్ని హర్షాన్ని వ్యక్తం చేస్తున్నాయని, కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా వాటన్నిటిని ఎదుర్కొని రాబోయే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.

## అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురి నియామకం



**(షణ్ముఖ వెలుగు, గోపవరం, జనవరి 30)**

అఖిలభారత రెడ్డి సంఘంలో రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన దేవిరెడ్డి తులసి రెడ్డినీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా, బద్వేలు మున్సిపాలిటి పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన ఊరు బిండి తిరుపతిరెడ్డి (మహేష్) ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా, బద్వేలు పట్టణానికి చెందిన నరమల పెంచల్ రెడ్డి బద్వేలు మున్సిపాలిటీ అధ్యక్షులుగా, బి మఠం మండల అధ్యక్షులుగా పూల చెన్నుపల్లె పల్లె గ్రామానికి చెందిన బద్వేలు వెంకటసుబ్బారెడ్డి, అట్లూరు మండల అధ్యక్షులుగా అరవ భాస్కర్ రెడ్డి, బి కోడూరు మండల అధ్యక్షులుగా పెద్దిరెడ్డి రమణారెడ్డినీ శుక్రవారం మధ్యాహ్నం వారి కార్యాలయంలో నియామక పత్రాలు అందజేసి వారిని నియమించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేండ్ల. వెంకటసుబ్బారెడ్డి తెలిపారు ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ అఖిల భారత రెడ్డి సంఘం లో పదవులు చేపట్టిన ప్రతి ఒక్కరూ వారి శక్తి మేర కృషి చేసి సంఘాన్ని అభివృద్ధి చేయాలని అదేవిధంగా మీ యొక్క నాయకత్వంలో రెడ్డి సామాజిక వర్గాన్ని మరింత బలోపేతం చెందుటకు కృషి చేస్తూ ఐకమత్యంగా ఉండే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు అనంతరం పదవులు చేపట్టిన పలువురు మాట్లాడుతూ అఖిలభారత రెడ్డి సంఘం అభివృద్ధికి, బలోపేతానికి మా శాయశక్తుల కృషి చేస్తామని మాకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు నారు పల్లె జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేండ్ల వెంకటసుబ్బారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

# మత్తుపదార్థాలు, గంజాయి నియంత్రణలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానం



- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్
- ఇప్పటి వరకు 398 కేసులు నమోదు
- ఏడు వాహనాలు స్వాధీనం
- 61.370 కిలోల గంజాయి స్వాధీనం

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 30)

మత్తుపదార్థాలు, గంజాయి నియంత్రణలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల జిల్లాస్థాయి నియంత్రణ, సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. మత్తు పదార్థాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాల ఉత్పత్తి మూలాలను గుర్తించి, జిల్లాలో పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ చెప్పారు. ఈ ప్రాంతాలలో ఇప్పటివరకు 398 కేసులు నమోదు అయ్యాయని, ఏడు వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. 61.370 కిలోల గంజాయిని బాపట్ల జిల్లాలో స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గడిచిన నెల రోజుల్లో మూడు కేసులు నమోదు అయ్యాయన్నారు. బీహార్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి కూలి పనులకు అధిక సంఖ్యలో వలసలు వస్తున్న వారే గంజాయి దిగుమతి చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ దిశగా నిఘా ఉంచామన్నారు.

ఇప్పటికే పలుమార్లు రైళ్లలో తనిఖీలు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలు ఏ ప్రాంతాల నుంచి ఉత్పత్తి అవుతున్నాయో నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడడానికి జిల్లా స్థాయిలో 661 విద్యార్థుల క్లబ్ లు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో చైతన్య కార్యక్రమాలు చేపట్టామన్నారు. రిసార్ట్స్ లాడ్జిలు వద్ద ప్రచార పత్రాలు, గోడపత్రాలు ఉంచాలని అధికారులకు ఆదేశించారు. గంజాయి వినియోగానికి మరుగ్గా ఉన్న 71 ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆ ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి, ఆ ప్రాంతాలలో డ్రోన్ ల ద్వారా సర్వేలెన్స్ చేస్తున్నామన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద మరింత పరిశీలన, పర్యవేక్షణ, నిఘా ఉంచామన్నారు. సీసీ కెమెరాలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆ ప్రాంతాలలో (తరువాయి 4లో...)

# ప్రభుత్వ వైద్యులు ప్రయివేటు వైద్యశాలలు నడిపితే కఠిన చర్యలు

- పొదిలి ఆసుపత్రి నిర్వహణ పై తీవ్ర అసంతృప్తి
- కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో బట్టబయలైన ఆసుపత్రి భాగోతం
- పనితీరు మార్చుకోకపోతే చర్యలు
- కారణం లేకుండా ఆసుపత్రి దాటితే సస్పెండ్ చేస్తా
- మీడియాతో మార్కాపురం

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 30)

ప్రభుత్వ వైద్యులు ప్రయివేటు వైద్యశాలలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు వైద్యాధికారులను హెచ్చరించారు. పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రం పై గత కొద్ది కాలంగా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకునేందుకు మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి రాజాబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను, వైద్యశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ వైద్యశాలలో సేవలపై అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తాను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఈ సందర్భంగా ఆయన మీడియాకు తెలిపారు. వైద్యశాలలో వైద్యులు సిబ్బంది అలసత్వంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టి కి వచ్చిందన్నారు. విధుల్లో ఉన్న వైద్యులు సిబ్బంది మధ్యలో ఎటువంటి కారణం లేకుండా బయటికి వెళ్ళరాదని సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ విషయాలు బహిర్గతమైతే వెంటనే సస్పెండ్ చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు రెగ్యులర్‌గా ఉండడం లేదని, నర్సులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్నారని, రోగులకు అవసరమైన మందులను బయట నుంచి కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ప్రతి రోగికి అవసరమైన ఏ ఒక్క మందైనా కూడా బయట నుంచి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా డాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడికి వచ్చిన రోగులు ఎవరు స్థానికంగా అందుబాటులో లేని ఔషధాన్ని జిల్లా కేంద్రానికి తెలియజేస్తే వెంటనే పంపించే ఏర్పాట్లు చేస్తామన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరికి ఉచిత వైద్యం ప్రభుత్వం అందిస్తుందని, కూడా బయట మందులు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా అన్ని ఉచితంగానే ఇస్తామన్నారు. ఇక వైద్యుల సేవలు రాకపోకల ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, అటువంటి ఫిర్యాదులు వస్తే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పై నిరంతరం పర్యవేక్షణ ఉంచామన్నారు. ప్రభుత్వం వైద్యాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున ఎటువంటి సేవలో నిర్లక్ష్యంగా ఉన్న వారి పై ఎటువంటి ఉదాసీనత లేకుండా సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. అదే విధంగా స్థానిక తాసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి, పంచాయతీ ఇంచార్జి కమిషనర్ మారుతీరావులు నిరంతరం ఈ వైద్యశాల పై పర్యవేక్షిస్తూ ఉండాలని, రోగులకు అవసరమైన సేవలు, ఇతర అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి తమకు తెలియజేయాలని వారికి మౌఖికంగా ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎంవి కృష్ణారెడ్డి, కమిషనర్ మారుతిరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# ముగింపు దశకు చేరుకున్న కలెక్టరేట్ నిర్మాణ పనులు

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 30)

కలెక్టరేట్లో చేపట్టిన నిర్మాణ పనులు దాదాపు ముగింపు స్థాయికి వచ్చాయని కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. ఈ ప్రాంగణంలో జరుగుతున్న పనులను జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులుతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వివిధ సెక్షన్లకు గదుల కేటాయింపు గురించి కలెక్టరుకు ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తుండడం వలన పనుల్లో ఘణనీయమైన పురోగతి వచ్చిందన్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి తన ఛాంబర్‌లోనే కూర్చుని విధులు నిర్వహిస్తానని ప్రకటించారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు కూడా కార్యాలయాలు ఏర్పరచుకొని వాటి చిరునామాలు కలెక్టర్ కార్యాలయానికి

# కెమికల్స్ వాడి కల్తీ చేశారు

## తిరుమల లడ్డూ పై మంత్రి స్వామి ధ్వజం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జనవరి 30)

వైకాపా ప్రభుత్వ హయాంలో పవిత్ర తిరుమల లడ్డూలో కెమికల్స్ వాడి కల్తీకి పాల్పడ్డారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. జంతు అవశేష కొవ్వు అవయవాలు ఉన్నట్లు తేలిందన్నారు. శుక్రవారం ఒంగోలులో మంత్రి మీడియాతో మాట్లాడారు. 2022లో జరిగిన ల్యాబ్ రిపోర్టు ప్రకారం కల్తీ జరిగినట్లు రిపోర్టు వస్తే ఎందుకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టలేదని ప్రశ్నించారు. పాలు లేదు, పెరుగు లేదు, నెయ్యి వాడలేదన్నారు. దీని పై డిబేట్ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. వైకాపా నాయకులు, వారి పార్టీ అధ్యక్షుడికి వెంకటేశ్వరస్వామి, హిందూ మతం పై గౌరవం ఉంటే ఇలాంటి తప్పుడు పనులు చేయరన్నారు.

# పర్చూరు నియోజకవర్గానికి అరుదైన రాష్ట్ర స్థాయి గౌరవం

ఏపీ విత్తన ధృవీకరణ సంస్థ పాలక మండలిలో పర్చూరుకు స్థానం

రాష్ట్ర డైరెక్టర్ గా మాలెంపాటి సత్యనారాయణ

సత్యనారాయణ నియామకం

రైతాంగానికి గర్వకారణం

సత్యనారాయణకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జనవరి 30)

పర్చూరు నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. వ్యవసాయం అంటే కేవలం సాగు కాదు...నాణ్యమైన విత్తనం నుంచే రైతు భవితవ్యం మొదలవుతుంది. అలాంటి కీలకమైన విత్తన వ్యవస్థను నియంత్రించే రాష్ట్ర స్థాయి సంస్థలో పర్చూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం లభించడం అరుదైన ఘట్టంగా మారింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ పాలక మండలిలో విత్తన వినియోగ రైతుల ప్రతినిధిగా మాలెంపాటి సత్యనారాయణను ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు వ్యవసాయ,సహకార శాఖ గురువారం జి ఓ ఆర్ టి నెంబర్ 67 విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ూూూజూ నియమావళి ప్రకారం రాష్ట్రస్థాయిలో ఇద్దరు డైరెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన సత్యనారాయణకు అవకాశం లభించడం పర్చూరు నియోజకవర్గానికి అరుదైన గౌరవంగా నిలిచింది. రెండు సంవత్సరాల పాటు ఆయన పాలక మండలి సభ్యుడిగా కొనసాగనున్నారు. రాష్ట్రంలో (తరువాయి 4లో...)

# కనిగిరిలో రైలు కూత

- కనిగిరి వరకు ట్రయల్ రన్ విజయవంతం
- రైల్వే అధికారులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే, ప్రజలు
- జనంతో కిక్కిరిసిన రైల్వే స్టేషన్
- త్వరలో ప్యాసింజర్ రైళ్ళ రాకపోకలు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జనవరి 30)

ఎన్నో దశాబ్దాల కల నెరవేరింది. కనిగిరికి రైలు రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నడికుడి నుండి కనిగిరి వరకు శుక్రవారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ప్రజలు ఆనందంలో మునిగితేలుతున్నారు. కనిగిరికి రైలు వస్తుందని తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున కనిగిరి రైల్వే స్టేషన్‌కు తరలివచ్చారు. రైలు కనిగిరి స్టేషన్‌కు రావడంతో ప్రజలు కేరింతలు కొట్టారు. రైల్వే స్టేషన్‌లో పెద్ద పండుగ వాతావరణం నెలకొంది. (తరువాయి 4లో...)






## నూతన జేసీకి అభినందనలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)**
ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన కల్పనా కుమారికి దళిత సంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ చప్పిడి వెంగళరావు, వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ లు మర్యాదపూర్వకంగా కలిసి బొకే లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దళిత జనాభా ఎక్కువని, జిల్లాలో దళితుల పట్ల దాడులు, దళిత, గిరిజన భూములు కబ్జాలకు గురౌతున్నాయని, దళిత, గిరిజనుల భూముల రక్షణ పై, స్మశానాలు కేటాయింపు పట్ల సమీక్ష చేయాలని విజ్ఞప్తి చేశారు. జేసీ సానుకూలంగా స్పందించారు.

## మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 30)**
మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామంలో మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి, వనిత క్లబ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద జాతిపిత, స్వాతంత్ర సమరయోధుడు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు బలసా సురేష్, మండల కార్యదర్శి, పొన్నూరు రామాంజనేయులు, కోశాధికారి దివ్యానందగుప్త, ఒక్కలగడ్డ మణికంఠ(అయ్యప్ప), వాసవి, వనిత క్లబ్ అధ్యక్షురాలు పేర్ల శ్రీలక్ష్మి, కార్యదర్శి ఆకుల జయశ్రీ, బాపనపల్లి శబరినాథ్, రీజనల్ కోఆర్డినేట్ పైడిమర్రి శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## కుష్టి వ్యాధుల పై సర్వే





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 30)**
స్థానిక సచివాలయంలో శుక్రవారం కుష్టి వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం వైద్య అధికారి కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కృష్ణ చైతన్య మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు చేతుల నుండి వస్తువులు జారిపోవడం, అందమైన మెరిసే జిడ్డు గల చర్మం గలవారు, అరచేతి కాళ్లు లలో స్పర్శ లేకపోవడం చర్మంపై రాగి రంగం మచ్చలు మొదలగు లక్షణాలు ఉన్న వారికోసం సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు రవికిరణ్, మల్లికార్జున రావు సిహెచ్ ఓ భాస్కర్ రావు, హెచ్ ఓ సురేష్ నాయకులు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ మండవ రామయ్య , పంచాయతీ కార్యదర్శి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరిలో రైలు కూత







రైల్వే అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైనుకు 1993లో నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చొరవతో 2014 నుండి 2019 వరకు రైల్వే పనులు ప్రారంభానికి ఊపందుకుందని తెలిపారు. గత ప్రభుత్వ పాలన ఐదేళ్లలో అభివృద్ధి నత్తనడకన నడిచిందన్నారు. ఎన్డీఏ కూటమి వచ్చిన తర్వాత అవరోధాలను అధిగమించి రైల్వే లైన్ నిర్మాణం వేగవంతమయ్యిందన్నారు. కనిగిరికి త్వరలో ప్యాసింజర్ రైలు రానున్నట్లు ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. కనిగిరి ప్రాంత ప్రజలు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం చేసే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కొండా కృష్ణారెడ్డి, ఫిరోజ్, రామయ్య, టిడిపి నాయకులు కొప్పుల్లి సురేష్, షరీఫ్, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, దద్దాల సురేష్‌రెడ్డి, బారా ఇమాం, మూలె బ్రహ్మారెడ్డి, తహశీల్దార్ వాసుదేవరావు, ఎంఈఓలు సంజీవి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పర్చూరు నియోజకవర్గానికి అరుదైన రాష్ట్ర స్థాయి గౌరవం

విత్తనాల నాణ్యత, ధృవీకరణ, రైతులకు అందే విత్తనాల ప్రమాణాలను నిర్ణయించే కీలక సంస్థలో రైతు ప్రతినిధిగా(డైరెక్టర్ గా) సత్యనారాయణ ఉండడం ద్వారా పర్చూరు రైతుల సమస్యలు నేరుగా ప్రభుత్వస్థాయిలో వ్యవసాయ శాఖ వేదికకు చేరనున్నాయి. విత్తన ధృవీకరణ సంస్థ పాలక మండలిలో పర్చూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం లభించడం రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు.....

ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా నియమితులైన మాలెంపాటి సత్యనారాయణకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయి కీలక బాధ్యత చేపట్టడం అభినందనీయమన్నారు. ఇది పర్చూరు నియోజకవర్గానికి గర్వకారణమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడే దిశగా సత్యనారాయణ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.రైతు కుటుంబానికి చెందిన వ్యక్తికి రాష్ట్ర స్థాయి బాధ్యత రావడం అభినందనీయమని, ఇది పర్చూరు నియోజకవర్గానికి దక్కిన గౌరవమని తెలిపారు.వ్యవసాయ రంగంపై అవగాహన ఉన్న వ్యక్తి పాలక మండలిలో ఉండటం వల్ల రైతుల ప్రయోజనాలు మరింత బలంగా ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది కేవలం వ్యక్తిగత నియామకం కాకుండా, రైతు విధానాల్లో మార్పుకు అవకాశం అని రాజకీయ, వ్యవసాయ వర్గాలు భావిస్తున్నాయి.రాష్ట్ర వ్యవసాయ విధానాలకు ప్రభావం విత్తన ధృవీకరణ సంస్థ నిర్ణయాలు భవిష్యత్తు పంటల దిగుబడిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మత్తుపదార్థాలు, గంజాయి నియంత్రణలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానం



పటిష్టమైన భద్రత కొరకు ఎలాంటి అవసరాలు ఉన్నాయో వాటిపై బాపట్ల సేవా సేతు వెబ్ సైట్ లో నమోదు చేయాలన్నారు. వివరాలను నిక్షిప్తం చేయగానే దాతలు ముందుకు వస్తారని ఆయన సూచించారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, అక్రమ రవాణా, వినియోగాన్ని బాపట్లలో పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ డి.రామాంజనేయులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి, కమిటీలోని జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముగింపు దశకు చేరుకున్న కలెక్టరేట్ నిర్మాణ పనులు



తెలియజేస్తున్నట్లు ఆయన వివరించారు. అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం వల్ల ప్రజా సమస్యలు, 'మీకోసం' అర్జీలు సత్వరమే పరిష్కారం అవుతాయని చెప్పారు. ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, తహసిల్దార్ చిరంజీవి కూడా వారితో పాటు ఉన్నారు. దీనికి ముందుగా క్యాంపు కార్యాలయంలోకి కూడా కలెక్టర్ పూజలు చేసి ప్రవేశించారు.








# ప్రభుత్వ వైద్యులు ప్రయివేటు వైద్యశాలలు నడిపితే కఠిన చర్యలు










## విద్యార్థినికి వైద్యం కోసం ఆర్థిక సహాయం



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జనవరి 30)**
అనారోగ్యంతో బాధపడుతున్న ఓ పేద కుటుంబానికి శివం ఫౌండేషన్ అండగా నిలిచింది. కెవి పాలెం గ్రామానికి చెందిన గానుగపాటి సత్యవాణి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. ఇటీవల తన ఎడమ కాలు మోకాలు వద్ద రక్తం గడ్డ కట్టి కాలు మొత్తం వాపుగా తయారయింది. సత్యవాణి తల్లిదండ్రులు అప్పు చేసి మరి రూ.3 లక్షలతో ప్రైవేట్ వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించారు. మంచానికి పరిమితమై విశ్రాంతి తీసుకుంటున్న ఆ పేద విద్యార్థిని తల్లిదండ్రులు సహాయం చేయమని శివం పౌండేషన్ ను ఆశ్రయించారు. శివం ఫౌండేషన్ ఫౌండర్ గొల్లపూడి శ్రీహరి స్పందించి ఆ పేద కుటుంబానికి తమ వంతు సహాయం కింద వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. వాణిశ్రీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫౌండర్ శ్రీహరి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ లేదా మరేదైనా ఇబ్బందులతో బాధపడుతూ సహాయం చేయమని తమ వద్దకు వచ్చిన వారికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందించడంలో ముందుంటామని అన్నారు. కార్యక్రమంలో పాటిబండ్ల బిక్షాలు, కర్ణ ప్రసాద్, నాగరాజు, తిరుమల, ఏసుబాబు, హరికృష్ణ, సలీం, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలను జైల్లకు పంపుతున్నారు

## వైస్సార్సీపీ పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)**

కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా అనేక మంది వైసీపీ నాయకులు కార్యకర్తలను జైల్లకు పంపుతున్నారు అని వైస్సార్సీపీ పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. మద్యం కేసులో రిమాండ్ నిందితులుగా ఉన్న ఆయన బెయిల్ పై విడుదలైన అనంతరం ఒంగోలు వచ్చిన సందర్భంగా ఆయనకు వైసీపీ శ్రేణులు స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన కూటమి ప్రభుత్వ తీరుపై పలు విమర్శలు చేశారు. పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులను జైలుకు పంపుతున్నారు అని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మాత్రమే పూర్తి స్థాయిలో అమలు చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికే చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలైందన్న ఆయన ఒంగోలు నుంచే కూటమి ప్రభుత్వం పై తిరుగుబాటు మొదలవుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలోనే తిరుమల లడ్డు కల్తీ జరిగిందని విమర్శలు చేసిన ఆయన జనసేన, టిడిపి ఎమ్మెల్యేలు అందరూ అక్రమ సంబంధాల పనిలో నిమగ్నమయ్యారు అని ఆరోపించారు. ఊహలతో కూడిన రాజధాని కాకుండా ప్రజలు మెచ్చే రాజధాని నిర్మించాలని అని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, నియోజవర్గాల సమన్వయకర్తలు ఆదిములపు సురేష్, అన్నా వెంకట రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)**

నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు వద్ద శుక్రవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. బిట్రగుంట నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న గూడ్స్ రైలు అమ్మనబ్రోలు సమీపంలో పట్టాలు తప్పింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## కరేడు ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ వర్ధంతి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 30)**

స్వాతంత్ర్య సమరయోధులు జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కరేడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి జీవిత విశేషాలను తెలియజేసినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మార్చి నాటికి పొదిలి ప్రాంతం నుండి రైళ్ల రాక పోకలు
## రైల్వే డిఆర్ఎం సుదేష్ణ సేన్

### రైల్వే అధికారులతో ట్రెయిల్ రన్
### మల్లవరం నుంచి పొదిలి, కనిగిరి వరకు ట్రాక్ పరిశీలన
### నిర్మాణ, రైల్వే లైన్ పనులు పరిశీలించిన డిఆర్ఎం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 30)**

పొదిలి ప్రాంత చిరకాల స్వప్నం రైలు మార్గంలో ప్రయాణం మరికొద్ది నెలలో సాకారం కానుందని రైల్వే డిఆర్ఎం సుదేష్ణ సేన్ తెలిపారు. శుక్రవారం ఆమె రైల్వే అధికారులతో కలిసి మల్లవరం రైల్వే స్టేషన్ నుండి ప్రత్యేక వాహనంలో కనిగిరి వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పొదిలి ప్రాంత ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నా రైల్వే మార్గం అందుబాటులోకి రానే వచ్చిందన్నారు. ఈ రైల్వే స్టేషన్ నుండి రెండు, మూడు వారాలల్లో బహుశా మార్చి నాటికి రైళ్ళు రాకపోకలు సాగేందుకు ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. కనిగిరి వరకు పనులు పూర్తి స్ధాయిలో ముగిసి ప్రారంభానికి సిద్దంగా ఉన్నట్లు ఉన్నతాధికారులకు లేఖ ద్వార తెలియజేశామన్నారు. అందుకు వారు సానుకులంగా విజయవాడ నుండి కురిచేడు, దర్శి, పొదిలి మీదుగా కనిగిరి వరకు ప్యాసింజర్ రైలు నడిపేందుకు అవకాశం ఉన్నట్లు ఆమె తెలిపారు. దీంతో పొదిలి ప్రాంత చిరకాల స్వప్నం రైల్వే లైన్ ఎట్టకేలకు త్వరలో సహకారం కానుంది.



## ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేత

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జనవరి 30)**

రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణలో మొదటి దశలో భాగంగా తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి విజ్ఞాపన పత్రాన్ని అందజేయడం జరిగింది. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఎదురుచూసినప్పటికీ నిరాశే ఎదురవుతున్నది. ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లలో ఉన్న ఆందోళన ను అసంతృప్తిని తెలియజేయుట కొరకు జనవరి 30న మండల తాసిల్దార్లకు వినతి పత్రాలు సమర్పణ,ఫిబ్రవరి 10న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా, ఫిబ్రవరి 25న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిర్ణయించిందన్నారు. జనవరి 30 తేదీ తర్లుపాడు మండల శాఖ అధ్యక్షులు కసెట్టి జగన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న అధికారి జూనియర్ అసిస్టెంట్ ఉదయశ్రీకి విజ్ఞాపన పత్రాన్ని ఇవ్వడం జరిగింది. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యతరగతి మంజూరు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిల వివరాలు పే స్లిప్పులు తెలిపి వెంటనే చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని, సిపిఎస్ రద్దు అంశంపై వెంటనే నిర్ణయం తీసుకొని పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్లకు చెల్లించవలసిన నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు అధ్యక్షులు కసెట్టి జగన్ బాబు,ప్రధాన కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్ ఆర్థిక కార్యదర్శి సాదు అంజని కుమార్, ఉపాధ్యాయులు చినమనగొండ శ్రీనివాసులు, బొప్పరాజు శ్రీనివాసులు, జెల్లి శ్రీనివాసులు, మేడ బలిమి, జెల్లి శ్రీనివాసులు, తాడి లక్ష్మీనారాయణ, నాగేళ్ల పాల్, సురేంద్రబాబు, అబ్దుల్ సుకుర్, పొదతరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





## 23వ డివిజన్ యువనాయకుల చొరవతో తాగునీరు వృథాగా పోతున్న చోట మరమ్మత్తు పనులు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)**



ఒంగోలు నగరం 23వ డివిజన్ గానుగపాలెం నందు మంచి నీళ్ళు వదిలినప్పుడల్లా 4 చోట్ల లీకేజీలు అయ్యి వృథాగా వాటర్ మురికి కాల్వల్లోకి వృథాగా పోతుంది. నీరు వృథాగా లీకేజీలు పడి పోతూ, తమ ఏరియాలోకి నీళ్ళు రాక ఇబ్బందులు పడుతున్నాం అని 23వ డివిజన్ ప్రజలు తమ ఇబ్బందులను స్థానిక టిడిపి నాయకులకు తెలపటం జరిగింది. దీనిపై 23 వ డివిజన్ టిడిపి నాయకులు గోపు వీరాంజనేయులు, వాయల మల్లిఖార్జున, పబ్బిశెట్టి రాము ఈ విషయాన్ని మున్సిపల్ సిబ్బందికి వారం క్రితం తెలపటం జరిగింది. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఆదేశాల మేరకు స్పందించిన మున్సిపల్ సిబ్బంది గానుగపాలెం ఏరియాలో వృథాగా పోతున్న లీకేజీలకు స్థానిక టిడిపి నాయకులు గోపు వీరాంజనేయులు, వాయల మల్లిఖార్జున సహకారంతో దగ్గర ఉండి మరి మరమ్మత్తులు చేయించడం జరిగింది.

## ఫిబ్రవరి 12న జాతీయ సార్వత్రిక సమ్మె కరపత్రాలు ఆవిష్కరణ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)**

ఫిబ్రవరి 12వ తేదీన జాతీయ సార్వత్రిక సమ్మెను కరపత్రాలు ఆవిష్కరణ చేయడం జరిగింది. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో, సిఐటియు ఒంగోలు నగర సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి మహేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్స్ అమలు చేయాలని. రాష్ట్రాలపై జారీ చేసింది ఉపాధి హామీ పథకం మహాత్మా గాంధీ పేరు మార్చుండి చట్టాన్ని నిరంజన్ చేయాలనే ప్రభుత్వ రంగం, ప్రైవేటుకరణిచేసే ఆలోచన దశగా విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులర్ చేయాలని, స్కీమ్ వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని ఆ సంఘటన ,కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సమ్మె జరుగుతుంది ఉద్యోగులు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు జి రమేష్, దామాశ్రీనివాసులు ,కే శ్రీనివాసరావు, జి నరసింహా, పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో మహాత్మగాంధీ వర్ధంతి



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జనవరి 30)**

మండలంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కత్తి తిరుపాలు 10వ తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు ఫ్యాడ్స్, పెన్నులు అందజేశారు. ఈ మెటీరియల్‌ని కస్తూర్బా గాంధీ ప్రిన్సిపల్ అంజమ్మ, వైస్ ప్రిన్సిపల్ ఇందిరా సుహాసిని చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన జేసీ కల్పనా కుమారి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)
ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజును నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కల్పనా కుమారికి జిల్లా ఎస్పీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## నామఫలకాలు తెలుగులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)
నగరంలోని వ్యాపార సంస్థల నామఫలకాలు తెలుగులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని ఆంధ్ర సారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ వ్యాపారస్తులను కోరారు. నగరంలోని ట్రంకు రోడ్ లో దుకాణాలకు ఆంగ్లంలో దుకాణం పేరు ఉండటంతో గమనించి వాటి క్రింద తెలుగులో కూడా దుకాణం పేరు ఉండేలా ముద్రించాలని దుకాణాల యజమానులను కోరారు. వారికి విజ్ఞాపన పత్రాన్ని అందించి గులాబీ పువ్వులు అందజేశారు. 10 రోజుల వ్యవధిలో తెలుగు పేరు ఉండే విధంగా చూడాలని కోరారు. మళ్లీ పది రోజులు అనంతరం అలానే ఉన్నట్లయితే వ్యాపారస్తుల పాదాలు కడిగి దుకాణం పేరు తెలుగులోకి మార్చే విధంగా వేడుకుంటామని అన్నారు. ట్రంక్ రోడ్డులోని పలు దుకాణాలను సందర్శించి వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, ఆంధ్ర సారస్వత పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షులు మూడమంచు వెంకటేశ్వర్లు, బొమ్మరాజు భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రముగ్ధులను చేసిన గజల్ శ్రీనివాస్ గానం

## అక్కినేని వర్ధంతి వేడుకల్లో ఆయన చేసిన గజల్ గానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)
గజల్ శ్రీనివాస్ గజల్ గానం ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. భార్య మీద పాడిన గజల్ ప్రేమ తత్వాన్ని తెలియజేయగా, అమ్మ, నాన్న మీద, మరణం పై పాడిన గజల్స్ ప్రేక్షకుల్ని కన్నీటి పర్యంతం చేసింది. మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసం, భాష సౌందర్యం కలగలిపి




గజల్స్ వినిపించారు. అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో సివిఎన్ రీడింగ్ రూమ్ లో ఏర్పాటుచేసిన అక్కినేని వర్ధంతి వేడుకలలో ఆయన చేసిన గజల్ గానం ప్రేక్షకులని అలరించింది. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ కి నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అవార్డు 2026 ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీధర్ రెడ్డి, కాకతీయ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరీ నారాయణ పాల్గొని అవార్డు ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షులు కళ్లగుంట కృష్ణయ్య, ప్రకాశంజిల్లా రచయిత సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, అక్కినేని కళాపరిషత్ గౌరవాధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కళ్లగుంట శ్రీనివాసరావు, తోట్టెంపూడి కృపారావు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యని నివేదించిన సిట్

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 30)
శ్రీవారి లడ్డులో నెయ్యి కల్తీ చేశారని సిట్ సుప్రీంకోర్టుకు నివేదిక ఇస్తే అవగాహన లేకుండా వైసిపి నాయకులు మాట్లాడడం సిగ్గుచేటని టిడిపి నాయకులు ఖండించారు. శుక్రవారం స్థానిక చీఫ్ విప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టిడిపి లీగల్ సెల్ నాయకులు నల్లబోతు రామకోటేశ్వరరావు, సైదారావు, టిడిపి నాయకులు పల్లె మీసాల దాసయ్య లు మాట్లాడారు. వైసిపి పాలనలో లైసెన్సు లేని డైరీల నుండి కొటేషన్లు ఇచ్చి కల్తీ నెయ్యి సరఫరాకు కాంట్రాక్టులు ఇచ్చారని, శ్రీవారి లడ్డు ప్రసాదంలో జరిగిన కల్తీ నెయ్యి పై టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డిని అరెస్టు చేయబోతే ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లడం జరిగిందని, లడ్డు నెయ్యి కల్తీపై సుప్రీంకోర్టు సిట్ దర్యాప్తుకు ఆదేశించడం జరిగిందన్నారు. 15 నెలల విచారణ జరిపిన సిట్ తిరుమల తిరుపతి లడ్డు నెయ్యిలో కల్తీ జరిగిందని చార్జిషీట్ వేస్తే అందుకు సమాధానం చెప్పలేక వైసిపి డైవర్షన్ పాలిటిక్స్ చేయటం సిగ్గుచేటు అన్నారు. శ్రీవారి లడ్డు నెయ్యి కల్తీ చేయడమే కాక నేడు దాటవేస్తూ దేవునిపై కూడా రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా స్వామి వారి లడ్డు లో నెయ్యి కల్తీ చేసిన వారిని దేవుడు క్షమించడని అన్నారు. వినుకొండ లో వైసీపీ నాయకులు ఐ రామ్మూర్తి, ఎంఎన్ ప్రసాదులు అంశాలపై సమగ్ర అవగాహన చేసుకుని మాట్లాడాలన్నారు. డి సి సిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మక్కెన రాజకీయ ప్రస్థానం తెరిచిన పుస్తకమని, అతను చేస్తున్న వ్యాపారం వ్యవసాయం బహిరంగంగా చెప్పడం జరిగిందన్నారు. చేపల చెరువుల ఆక్రమణలు, అవినీతి అని మాట్లాడుతున్న వైసిపి నాయకులకు నాడు తెలియలేదా అని ప్రశ్నించారు. గత వైసిపి పాలనలో మక్కెన మల్లికార్జునరావు వైసీపీలో మీ బొల్లా బ్రహ్మనాయుడు వెంటే ఉన్నారు కదా అప్పుడు అక్రమ చేపల వ్యాపారం కనపడలేదా అని ఎద్దేవా చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు వ్యవహార శైలి నచ్చక, పార్టీ లోపాలను గుర్తించి

### డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న వైసిపి

### మక్కెన పై కక్షతో చేస్తున్న ఆరోపణలు తగవు

### వైసిపి వ్యాఖ్యలను ఖండించిన టిడిపి నాయకులు




ఆయన టిడిపిలో చేరడం మక్కెన కృషిని గుర్తించిన చంద్రబాబు నాయుడు జిడిసిసి పదవి ఇవ్వటం జీర్ణించుకోలేక కక్షతో నేడు వైసిపి నాయకులు ఆయనపై విషం చిమ్మటం అత్యంత హేయమన్నారు. నాడు రాష్ట్రంలో విద్యాభివృద్ధి క్షీణించిందని మాట్లాడటం ముమ్మాటికి సిగ్గుచేటు ఉన్నారు. వైసిపి పాలనలో ఉపాధ్యాయులను అగౌరవ పరుస్తూ బ్రాందీ షాపుల దగ్గర డ్యూటీ వేసిన చరిత్ర వైసిపిదన్నారు. ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వటం చేతగాని అసమర్ధ పాలన సాగించారన్నారు. మంత్రి లోకేష్ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చి అభివృద్ధి చేస్తుంటే వైసిపి ఓర్వలేకపోతుందన్నారు. రాష్ట్రంలో రక్షణ లేదని వారి అవివేకానికి నిదర్శనమన్నారు. 20 నెలల కూటమిపాలనలో ఎక్కడైనా దాడులు జరిగాయా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా దాడులు, దోపిడీలు, దుర్మార్గాలు జరిగాయని, నాడు రాష్ట్ర ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రశ్నించిన వారి గొంతులు నొక్కి తప్పుడు కేసులు బనాయించి రాక్షస పాలన సాగించారన్నారు. కూటమి పాలనలో సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సమర్థవంతమైన లాండ్ ఆర్డర్ కొనసాగిస్తూ ప్రజలకు రక్షణ కల్పించడం వలన నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నారని అన్నారు. మెప్పుకోసం మీరు నిరాధారణమైన ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, ప్రభుత్వంపై విమర్శలు చేయటం తగదని, రెచ్చగొట్టే విధానాలు మానుకోకపోతే మీకు ప్రజలే తగిన విధంగా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో టీడీపీ నాయుకులు



బొంకూరు రోశయ్య, పత్తి పూర్ణచంద్రరావు, సుబ్బారావు, అచ్యుత కోటేశ్వరరావు, పెసల వెంకటనారాయణ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే ధ్యేయం

## ప్రజాదర్బార్‌లో టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జనవరి 30)
దేశానికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. శుక్రవారం ఎర్రగొండపాలెం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఇంచార్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరియు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పేద ప్రజల సంక్షేమానికి అన్ని విధాలుగా పాటుపడుతుందన్నారు. అందులో భాగంగానే మీకు అందుబాటులో ఉండే విధంగా ప్రజా సమస్యల పరిష్కారం వేదిక ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీలతో వచ్చిన గ్రామాల ప్రజలు తమ గ్రామాల సమస్యలను ఇన్చార్జి ఎరిక్షన్ బాబు దృష్టికి తీసుకుపోవడమే గాక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అందులో కొన్ని సమస్యలను అధికారులు అక్కడికక్కడే పరిష్కారం చేశారు. మరికొన్ని సమస్యలను ఆయా శాఖ అధికారులను త్వరితగతిన పరిష్కరించాలని ఎరిక్షన్ బాబు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి










(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)
విద్యతోపాటు విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి అన్నారు. శుక్రవారం ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీలో డీఎస్సీ ద్వారా నూతనంగా అంబేద్కర్ కురుకులాల్లో నియమితులైన టిజిటి, పిఈటీ లకు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ శిక్షణలో భాగంగా షార్ట్స్ స్వచ్ఛంద సంస్థ వారు ,విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతపై "డెటాల్ బానేగా స్వచ్ఛ ఇండియా "పై అవగాహన కల్పించడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా వంద శాతం ఉత్తీర్ణత కచ్చితంగా సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. విద్యార్థుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం 14 కోట్లతో గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు వంటవారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఐఐటి, నీట్ ఎక్సెలెన్సీ సెంటర్లను 10 కి పెంచామని మంత్రి తెలిపారు. 2017 లో ఐఐటి, నీట్ లో శిక్షణ ఇవ్వటం ద్వారా ఎంబీబీఎస్ 20 మందికి ఎన్ఐటి,ఐఐటి లలో 37 మందికి సీట్లు వచ్చాయన్నారు. వారికి ముఖ్యమంత్రి గారు ఒక్కొకరికి లక్ష రూపాయలు నగదు బహుమతి గా అందించారని మంత్రి తెలిపారు. విద్యార్థులకు విద్య తోపాటు శరీర దారుఢ్యం కొరకు క్రీడలు,సృజనాత్మకతను పెంపొందించడానికి సైన్స్ ఫేర్ నిర్వహించామన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారు ఉన్నత స్థాయి కి చేరుకోవటానికి మీ వంతు సహకారం అందించాలన్నారు. మీరు కూడా సర్వీస్ రూల్స్ తెలుసుకోవాలన్నారు. మన గురుకులాల్లో వెల్త్ హెల్త్ ఆఫీసర్ ను నియమించామని పిల్లల ఆరోగ్యం పై పూర్తి స్థాయిలో జాగ్రత్త తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.మెనూ తప్పక పాటించాలని ఆయన ఆదేశించారు.కొద్దిలో నీట్ సీట్ మిస్ అయిన విద్యార్థులకి విజయవాడ లో 65 మంది కి ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. సింగరాయకొండ గురుకులలో 2 కోట్ల 25 లక్షల రూపాయలతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మూర్తి, గురుకుల జాయింట్ సెక్రటరీ రూపవతి, డి సి ఓ జయ, నెల్లూరు డిసిఓ ప్రభావతి, డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, డిఎంహెచ్ఓ టి వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

### ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

### క్రీడలకు ప్రాధాన్యత కల్పించండి


### ఉత్తమ విద్యార్థులకు శివశక్తి అవార్డులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 30)
పదో తరగతి (టెన్త్) పరీక్షల్లో వినుకొండ నియోజకవర్గం నుండి 2 వేల మంది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక చీఫ్ విప్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళికాబద్ధమైన అధ్యయనం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న సబ్జెక్టులపై దృష్టి సారించి విద్యార్థులకు మంచి బోధనను అందించాలని సూచించారు. ప్రతి శనివారం నో బ్యాగ్ డే పాటిస్తూ విద్యార్థులకు క్రీడల్ని ప్రోత్సహించి, నైతిక విలువలు, మానవతా విలువలు బోధించాలని తెలిపారు. పదో తరగతిలో వినుకొండ నియోజకవర్గం లో స్టేట్ ఫస్ట్, జిల్లా ఫస్ట్ మార్కులు వచ్చిన విద్యార్థులకు, ఉత్తమ విద్యార్థి, ఉత్తమ స్కూలు, ఉత్తమ ఉపాధ్యాయులు మూడు విభాగాల్లో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ నుండి ఉత్తమ అవార్డులు, రివార్డులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ర్యాంకులతోపాటు క్రమశిక్షణ ఉన్నత ఆశయాలు అలవర్చుకునే విధంగా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమావేశానికి డిప్యూటీ డీఈవో సుభాని, రిసోర్స్ పర్సన్ ప్రసాదరావురావు, ఎంఈఓ జఫ్రెల్లా ఖాన్, తదితరులు ఉన్నారు.

### సాక్షి రామలింగేశ్వర స్వామి అభిషేకంలో పాల్గొన్న మాజీ ఏఎంసి చైర్మన్ మారం వెంకారెడ్డి



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జనవరి 30)
చీమకుర్తిలోని గంగా పర్వత వర్ధిని సమేత సాక్షి రామలింగేశ్వర స్వామి దేవస్థానం(శివాలయం) నందు శుక్రవారం ఘనంగా శివ పార్వతుల నగరోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గుడిలో ఏర్పాటు చేసిన పంచామృత అభిషేకములు, శివలింగాభిషేకం కార్యక్రమాన్ని పురస్కరించుకొని మాజీ ఏఎంసి చైర్మన్ మారం వెంకారెడ్డి అభిషేకం నిర్వహించారు.

# ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదు

# ఉపాధి హామీ చట్టం కాపాడుకునేందుకు ఉద్యమం చేపట్టాలి

## పథకానికి రూ 2లక్షలకోట్లు కేటాయించాలి

## సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)

ఎన్నో ఉద్యమాల ఫలితంగా సాధించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం విబిజిఆర్ఎఎంజి పేరుతో నిర్వీర్యం చేస్తే సహించేది లేదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి స్పష్టం చేశారు. శుక్రవారం నాడు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద చేపట్టిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఎస్) చట్టాన్ని బిజెపి ప్రభుత్వం సవరణ పేరుతో నిర్వీర్యం చేసే చర్యలను ఆమె తీవ్రంగా తప్పు పట్టారు. కేంద్రం అనుసరిస్తున్న చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. 125 రోజులు పనులు కల్పన పేరుతో కేంద్రం వాటాను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాల వాటాను పెంచుతూ సవరించిన చట్టం గ్రామీణ పేదలకు శరాఘాతమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం కేవలం వ్యవసాయ కూలీలకు మాత్రమే నిర్దేశించినది కాదన్నారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థకు పట్టుగొమ్మగా నిలవడంతో పాటు సాగునీరు, తాగునీరు వనరుల అభివృద్ధికి దోహద పడిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.కేంద్రం రూపొందించిన ప్రకారం 40 శాతం వాటగా రాష్ట్ర ప్రభుత్వం రూ 4,వేల కోట్లు వెచ్చించగలిగే సత్తా ఉందా అని ప్రశ్నించారు. లేకుంటే కేంద్రాన్ని డిమాండ్ చేసి ఆమేరకు నిధులు రబట్టే ధైర్యం ఈ రాష్ట్రానికి ఉందా అని సవాలు విసిరారు. కేంద్రం ఉపాధి హామీ చట్టం అమలుకు రూ 2లక్షలు కోట్లు కేటాయించాలని, పథకాన్ని యధాతదంగాఅమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టం పరిరక్షణకు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం సవరణ పేరుతో కేంద్రం చేపట్టిన చర్యలకు దేశావ్యాప్తంగా తీవ్ర ప్రతిఘటన వస్తున్న అంశాన్ని గుర్తు చేస్తూ ఫిబ్రవరి 12 న దేశవ్యాప్తసమ్మెలో భాగంగా వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు పార్టీ నాయకులు, కార్యకర్తలచే మహాత్మా గాంధీ స్పూర్తితో గ్రామీణ పేదలకు, రైతు, కూలీలకు అండగా ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి అందరితో కలసి పోరాడతామని ప్రతిజ్ఞ చేయించారు. తొలుత నాయకులు గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు,సయ్యద్ హనీఫ్, జివి కొండారెడ్డి, ఎం రమేష్, డి సోమయ్య,జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు,జె జయంతి బాబు, బి రఘురామ్, వి బాలకోటయ్య, బంకా సుబ్బారావు, జి బాలనాగయ్య, ఊసా వెంకటేశ్వర్లు, కెజి మస్తాన్, డికె ఎం రఫీ, వి ఆంజనేయులు, కె మాల్యాద్రి, పిసి కేశవరావు, జి రమేష్, కె రమాదేవి, పి కల్పన, ఉబ్బా ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

---

## అన్నం పరబ్రహ్మస్వరూపం

## మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘ అధ్యక్షులు కెవి సుబ్బారావు





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 30)

అన్ని దానాలలో కల్లా అన్నదానం చాలా గొప్పదానమని ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షులు కెవి సుబ్బారావు అన్నారు. శుక్రవారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సీనియర్ మెసింజర్ మేనల్లుడు గీతాన్స్ పుట్టినరోజు సందర్భంగా తెలుగు గంగ కాలనీలోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలోని అనాధ వృద్ధులకు ఫ్రూట్స్ పండ్లు స్వీట్లు, పలువురికి రుచికరమైన అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కేవి సుబ్బారావు, వార్త రమణ, పబ్బతి చక్రపాణి, జొన్నలగడ్డ సుధాకర్, అమ్మ సెల్ పాయింట్ బండారు సురేష్ బాబు, సర్వేశ్వర ప్రసాద్‌తో పాటు పలువురు మాట్లాడుతూ మురహర నాగార్జున సతీమణి దివ్య కుమారుడు గీతాన్స్ పుట్టినరోజు సందర్భంగా అనేక రకాలుగా ఆసరా కోల్పోయిన అనాథ వృద్ధులకు అల్పాహారం పండ్లు వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని వారి కుమారుడు పుట్టినరోజు సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవికుమార్, పత్తి హరీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జిల్లాలో క్షేత్ర స్థాయిలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

### జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)

జిల్లాలో క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుక్రవారం ఉదయం ఆమె బాధ్యతలు చేపట్టారు. తొలుత జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఇతర రెవెన్యూ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దల ఆశీర్వచనాల మధ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కల్పనా కుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మీడియాతో మాట్లాడుతూ తాను జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని, ప్రకాశం జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్న భూ సమస్యలు, రెవెన్యూ సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతి పై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాల అమలులో ఏవైనా సమస్యలు వుంటే సంబంధిత శాఖల అధికారులు స్వయంగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారం పై దృష్టి సారించడం జరుగుతుందని వివరించారు. అనంతరం పలువురు జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు జాయింట్ కలెక్టర్ ను కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



---


# పోలీస్ విధుల నిర్వహణకు డైరీ, పోలీస్ సంక్షేమ సమాచార దీపిక ఎంతో ఉపయోగకరం

### జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆవిష్కరించిన రాష్ట్ర పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ 2026, పోలీస్ సంక్షేమ సమాచార దీపికను శుక్రవారం జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పోలీస్ అధికారులు, సిబ్బందికి అందజేశారు. ఈ డైరీలో పోలీస్ అధికారులు, సిబ్బందికి నిత్య విధుల నిర్వహణలో అవసరమయ్యే అన్ని రకాల కీలక సమాచారం పొందుపరచడంపై జిల్లా ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు. ఇది విధుల్లో ఉన్న పోలీసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో పాటు వారి పనితీరును మరింత సమర్థవంతంగా చేయడంలో దోహదపడుతుందన్నారు. అలాగే పోలీస్ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన సమాచార దీపిక సిబ్బందికి అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఈ డైరీలోని సమాచారాన్ని సమర్థంగా వినియోగించుకుని తమ విధులను క్రమశిక్షణతో, నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ జు. హాజరత్తయ్య (రాష్ట్ర జనరల్ సెక్రటరీ), ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, పీసీఆర్ ఇన్స్పెక్టర్ దుర్గప్రసాద్, ఐటి కోర్ సీఐ వెంకటేశ్వరరావు, ఆర్ఐ రమణరెడ్డి, ఆర్ ఎస్ఐ తిరుపతిస్వామి(రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్), ఎస్పీ సీసీ నారాయణ, మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



---

## కిట్స్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ ఆశయాల పై యువతకు సందేశం






(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 30)

గాంధీ వర్ధంతి సందర్భంగా మార్కాపురంలో విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తి భావన, సామాజిక బాధ్యతను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కళాశాల ఛైర్మన్ అన్నా రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీజీ ఆశయాల ప్రాసంగికతపై స్పష్టమైన సందేశం ఇచ్చారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ అన్నా రాంబాబు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవితం ప్రతి విద్యార్థికి ఒక పాఠం. సత్యం, అహింస, క్రమశిక్షణ వంటి ఆయన సిద్ధాంతాలు కేవలం మాటలకే పరిమితం కాకుండా యువత జీవితాల్లో ఆచరణగా మారాలి. విద్యతో పాటు విలువలు కలిగిన యువతే దేశ భవిష్యత్తును బలంగా నిర్మించగలరు అని పేర్కొన్నారు. అలాగే నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే సాంకేతిక నైపుణ్యాలతో పాటు నైతిక బలం అవసరం. గాంధీజీ బోధనలు యువతను సరైన దిశలో నడిపించే శాశ్వత మార్గదర్శకాలు అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమానికి ఆరంభంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మౌనవ్రతం పాటించి గాంధీజీ సేవలను స్మరించుకున్నారు.

## ఏపీ జెన్కో పరిధిలో 27 మందికి కారుణ్య నియామక పత్రాలు










(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జనవరి 30)

ఏపీ జెన్కో పరిధిలో 27 మందికి కారుణ్య నియామక పత్రాలను శుక్రవారం ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తోందన్నారు. చదువుకు తగిన ఉద్యోగాలు ఇచ్చి వారి సేవలను విద్యుత్‌శాఖలో వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా ఇంజనీరింగ్ స్థాయి ఉద్యోగం ఇవ్వలేదని, ఉన్నత విద్యార్హతలు ఉన్నవారిని కూడా జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకే పరిమితం చేశారని విమర్శించారు. సీఎం చంద్రబాబు చొరవతో ఏజ్ రిలాక్సేషన్ ఇచ్చి అర్హులైన వారికి ఇప్పుడు జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాలు కూడా ఇస్తున్నామని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 600 మందికి పైగా కారుణ్య నియామకాలు పూర్తి చేశామని, ఇక పై ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ ప్రక్రియ చేపడతామని మంత్రి గొట్టిపాటి కీలక ప్రకటన చేశారు.

## మహాత్మా గాంధీ జీవితం అందరికీ ఆదర్శప్రాయం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)
శాంతి, అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఒంగోలులోని గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, బి ఎన్ విజయ్‌కుమార్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఓబులేష్, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, తాత ప్రసాద్, పవన్, చెన్నకేశవ ఆలయ చైర్మన్ సురేష్, గోగినేని రామారావు, పాలపర్తి లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య నాయకులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## మార్చి 15 లోపు బిల్లులు అప్లోడ్ చేయాలి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 30)
ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసి మార్చి 15వ తేదీ లోపు బిల్లులను కూడా అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డ్వామా, పంచాయతీరాజ్ అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై ఆయన ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను సమర్ధంగా వినియోగించాలని స్పష్టంగా చేశారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రాధాన్యత ప్రాతిపదికన కొత్త పనులపైనా దృష్టి పెట్టాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో, ముఖ్యంగా బాలికల హాస్టళ్లలో మార్చి 8వ తేదీ నాటికి టాయిలెట్ల నిర్మాణాలు, మరమ్మతు పనులు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, ఆయా శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీని యధావిధిగా కొనసాగించాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని పేరు మార్చి పథకానికి తూట్లు పొడవడానికి నిరసిస్తూ ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక నిరసన దీక్ష ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆధ్వర్యంలో సామూహికనిరసన కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సామూహిక నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా అధ్యక్షులు సయ్యద్ మౌలాలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ దేశంలోని నిరుపేదలకు వలసలు నివారణ, గ్రామీణ పేదల ఆర్థిక భరోసా కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని అన్నారు. ఈ పథకం వల్ల పేద ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి బ్యాంకు మెట్లు ఎక్కగలుగుతున్నారని రిజర్వ్ బ్యాంకు కితాబు ఇచ్చింది అన్నారు. ఈ పథకానికి విబిజీ రాంజీ అనే పేరు మార్చి గ్రామీణ పేదల ఆర్థిక పరిస్థితి పై దెబ్బ కొట్టే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఈ పనిని తక్షణం మానుకొని పాత చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పథకంలో రాష్ట్ర ప్రభుత్వం 10% కేంద్ర ప్రభుత్వం 90% నిధులు కేటాయింపు జరిగేదని దానిని మార్చి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 40% కేంద్ర ప్రభుత్వం 60 శాతం గ్రాంట్లు ఇవ్వడం అసాధ్యం అని అన్నారు. ఉపాధి హామీ పనుల కేటాయింపు నిర్వహణ పూర్తిగా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి వెళ్లడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటుందని అప్పుడు రాష్ట్ర అభివృద్ధి కొంతమేర కుంటు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్షం ఈ పథకం మార్పు చేయడం విషయంలో మౌనం వహించడం అత్యంత దుర్మార్గం అన్నారు. కావున తక్షణం కేంద్ర ప్రభుత్వం వి బి జి రామ్ జి పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మౌలాలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని యధావిధిగా అమలు చేసేంతవరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు జీపీ రామారావు, గద్దల రవి, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లూరి మురళీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం విజయ, తిరుపాలు గుజ్జులబాలిరెడ్డి, వై. పుల్లమ్మ, రాగాల అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమస్ఫూర్తితో ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుంటాం
### సీపీఎం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 30)
జాతిపిత గాంధీజీ వర్ధంతి సందర్భంగా పేదలకు ఎంతగానో ఆసరాగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ కోసం కృషి చేస్తామని ఉలవపాడులో ఉపాధి పని ప్రదేశంలో, కరేడు పంచాయతీ పెద్దపల్లి పాలెం లోని తుఫాను షెల్టర్ వద్ద శుక్రవారం వ్యవసాయ కూలీలు సిపిఎం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శిజీవీబీ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో గాంధీజీ పేరు లేకుండా తీసివేసిందని, బడ్జెట్ లో ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం40 శాతం నిధులను కోత విధించిందని. ఉపాధి హామీ పథకానికి విబి జి రామ్ జి అనే పేరు మార్చిందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి నిర్వీర్యం చేయాలని ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. పాత పద్ధతిలోనే మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉపాధి హామీ పథకం 2005లో యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో వచ్చిందని తెలిపారు. ఈ పథకం వచ్చిన తర్వాత కూలీల ఆత్మస్థైర్యం పెరిగిందని అన్నారు. కూలి రేట్లు కూడా పెరిగాయని పేర్కొన్నారు. వలసల నివారణకు ఈ పథకం తోడ్పడిందని పేర్కొన్నారు. కూలీలకు ఎంతగానో ఆసరాగా ఉన్న ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఈ పథకాన్ని యధావిధిగా పునరుద్ధరించాలని కోరారు. లేనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉలవపాడు మండల సహాయ కార్యదర్శి గొల్ల పోతు శివకుమార్,పీతా. శ్రీను,నాయుడు. వెంకటేశ్వర్లు, కొక్కిలగడ్డ వెంకట్రావు, ఉపాధి మేట్ సర్వేపల్లి శ్రావణి, ఉపాధి కూలీలు నెల్లూరి రంగయ్య, చందలూరి కొండయ్య, కాకుటూరి శ్రీను, ఎన్ లక్ష్మమ్మ, కే శ్రావణి, కండ్లగుంట వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పై తహసీల్దార్‌కు వినతి



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జనవరి 30)
ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకుల ఆధ్వర్యంలో త్రిపురాంతకం తాహసిల్దార్ కృష్ణమోహన్ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు మార్కాపురం జాన్ శామ్యూల్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జాన్ శామ్యూల్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 30 న తహసీల్దార్లకు, ఫిబ్రవరి 10 న జిల్లా కలెక్టర్ల కార్యాలయంలో వినతి పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిల వివరాలు పే స్లిప్ లో తెలిపి వెంటనే చెల్లించుటకు చర్యలు తీసుకోవాలి అన్నారు. సిపిఎస్ రద్దు అంశంపై వెంటనే నిర్ణయం తీసుకొని పాత పెన్షన్ విధానం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 మేరకు 2004 సెప్టెంబర్ కు మునుపు నోటిఫికేషన్ ద్వారా నియమింపబడిన 2003 డిఎస్ సి ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర విభాగాలలో నియమించబడిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని సత్వరం అమలు చేయాలి అన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ చేసిన మరుసటి రోజునే పెన్షన్ సౌలభ్యాలు చెల్లించాలి అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించవలసిన 4 డి. ఏలను వెంటనే మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిస్కరించపోతే వెంటనే ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, రాప్ అధ్యక్షులు శామ్యూల్, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, మండల ఉపాధ్యక్షులు నాగేశ్వరావు, మండల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి నేత చెవిరెడ్డిని కలసిన వైసీపీ నేతలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 30)
ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అక్రమంగా బనాయించిన మద్యం కేసులో అరెస్ట్ అనంతరం జైలు నుండి బెయిల్ పై విడుదలైన వైసిపి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని శుక్రవారం ఒంగోలులో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం ఇన్చార్జి అన్న రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నాతో పాటు వైసీపీ స్టేట్ సెక్రెటరీ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పార్టీ నాయకులు పోరెడ్డి చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, జవ్వాజి రంగారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, దయ్యాల నాగ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుల డిమాండ్లు పరీక్షరించాలని మండల ఉపాధ్యాయ సంఘం తహసిల్దార్ కి వినతి పత్రం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 30)
ఎస్టియు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం 30వ తేదీన ఉలవపాడు మండలశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించాలని ఉలవపాడు మండల తాసిల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పౌరాణిక, పద్య నాటకాల ప్రదర్శన



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 30)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక మరియు ఏపీ తెలుగు నాటక అకాడమీ వారి సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవ సొసైటీ వారి ఆధ్వర్యంలో పద్మశ్రీ నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకొని వినుకొండలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నందు శనివారం సాయంత్రం ఐదు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు. ఎన్టీఆర్ నటించిన చిత్రాలలోని పాటలతో చింతామణి, బాలనాగమ్మ, శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మం జీవిత చరిత్ర అను పౌరాణిక పద్య నాటకాలు నిర్వహించడం జరుగుతుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ కోటప్పకొండ పర్యటనకు వచ్చినప్పుడు జీవనజ్యోతి స్వచ్ఛంద సేవ సొసైటీ సభ్యులు కలసి అంతరించిపోతున్న కళలను సంప్రదాయాలను పెంపొందించే విధంగా కూటమి ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలని కళాకారులకు కావలసిన ఐడి కార్డ్, పెన్షన్, ఇంటి స్థలాలు,ఇళ్ళు ఏర్పాటు చేసి పేద కళాకారులను ఆదుకోవాలని వారిని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం మీరు అడిగిన అన్ని పనులను చేయటానికి ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కళాకారులను ఉద్దేశించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలియజేయడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తూ ఎన్టీ రామారావు వర్ధంతి వేడుకలు జరుపుకొనుటకు రాష్ట్రంలో అన్ని జిల్లాలలో పర్మిషన్ ఇస్తుందని తెలియజేశారు. అందులో భాగంగా రాష్ట్రమంతాజరుగుతున్న కార్యక్రమాలలో విశేషంగా రేపు జరగబోవు కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, విశిష్ట అతిథిగా నాటక అకాడమీ ఏపీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్ మల్లికార్జున రావు, ప్రత్యేక ఆహ్వానితులుగా జబర్దస్త్ అప్పారావులు విచ్చేయుచున్నారు. కార్యక్రమానికి వేలాదిగా పాల్గొని పౌరాణిక పద్య నాటకాలను తిలకించి జయప్రదం చేయవలసిందిగా కోరారు. జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సొసైటీ కార్యాలయం వినుకొండ నందు ఏర్పాటు చేసిన సభలో చైర్మన్ డాక్టర్ మంద వెంకట్రావు, సొసైటీ సభ్యులు ధర్నాసి కోటయ్య, సురవి దేవ సహాయం, మాసిపోగు దాసు, చందలూరు శివ నాగేశ్వరరావు, చింతలపూడి గురవాచారి, వెంకటేశ్వర్లు , జి లక్ష్మీనారాయణ, కళాకారులు పాల్గొని తెలియజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

ప్రజాదర్బార్ కు వినతుల వెల్లువ





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 30)

ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు ప్రజా దర్బార్ కు హాజరై వారి సమస్యలను చీఫ్ విప్ జీవి ఆంజనేయులుకు విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానని చీఫ్ విప్ జీవి పేర్కొన్నారు.33 అర్జీలు వచ్చాయి వినుకొండ పట్టణముతోపాటు గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్స్, సిసి రోడ్స్, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వివిధ వర్గాల ప్రజలు విన్నవించారు. ఫిర్యాదులను పరిశీలించిన చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి పాలనలో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని వివరించారు. సంక్షేమం అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తూ ప్రజా ప్రభుత్వం గా ప్రజల మన్ననలు పొందిందన్నారు.

## పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 30)



పాత ఉపాధీ హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ గాంధీ వర్ధంతి సందర్భంగా సిఐటియు ఆద్వర్యంలో పట్టణంలోని చిన్న బస్టాండ్ ఒకటో సచివాలయం వద్ద గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటి వల్ల కన్వీనర్ బి కోటేశ్వరరావు మాట్లాడూతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేపట్టాలని పిలుపు నిచ్చారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం సవరణ పేరుతో నిర్వీర్యం చేసే చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించిన ఈ పథకాన్ని రద్దు చేసి తెచ్చిన కొత్త చట్టం రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపి పేదల పొట్ట కొట్టే చర్యలకు పూనుకుందని విమర్శించారు కొత్తచట్టం వలన పనిదినాల కోత, నిధులు తగ్గింపు, వేతనాలు చెల్లింపులో జాప్యం, వంటి చర్యల వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. గతంలో కేంద్రప్రభుత్వం 90 శాతం రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిదులతో ఈ పదకాన్ని విజయవంతంగా కొనసాగిస్తుండగా కొత్త చట్టం వలన ముందుగా రాష్ట ప్రభుత్వాలు 40శాతం నిదులు కేటాయించిన తరువాతనే మిగిలిన 60 శాతం కేంద్రం విడుదల చేస్తుందనడం విడ్డూరంగా ఉందన్నారు. 40 శాతం నిదులు కేటాయించే స్దితిలో రాష్ట్రాలు లేవని, క్రమేణా దీనిని ఎత్తివేసే పదకంలో ఒక భాగమని విమర్శించారు గ్రామీణ ఆర్దిక వ్యవస్ద కు బలమైన ఆదారం అయిన పాత ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్దరించి పనిదినాలు 200 రోజులకు పెంచి సరిపడ నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు.అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నగేష్, ఆంజనేయులు, శివ, జార్జి, బైరాగి, దావీదు, బ్రహ్మయ్య, రామాంజి, అంకయ్యలు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశా నాయక్ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జనవరి 30)

రాష్ట్ర శాఖ పిలుపు మేరకు యర్రగోండపాలెం మండల శాఖ ఆధ్యర్యంలో దశల వారి ఆందోళలో భాగంగా మండల తహసిల్దార్ గారికి వినతి పత్రం సమర్పిస్తూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. దేశా నాయక్ మాట్లాడుతూ జీవన వ్యయం నిరంతరం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితులో మా న్యాయమైన డిమాండ్ల అమలు పరచాలని కోరడమైనది.. వెంటనే 12 వ వేతన సవరణ సంఘం ను ఏర్పాటు చేసి 30% మధ్యంతర భృతి మంజూరు చేయాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు పే స్లిప్పులో చూపించి వెంటనే చెల్లించాలి.సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఓపిఎస్ అమలు చేయాలి.కేంద్ర ప్రభుత్వ మెమో నెం.57 మేరకు 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, పోలీసులు మరియు ఇతర శాఖల ఉద్యోగులకు ఓపిఎస్ ను తక్షణమే అమలు చేయాలి.పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఉద్యోగ విరమణ చేసిన మరుసటి రోజునే పెన్షన్ సౌకర్యాలు చెల్లించాలి.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన నాలుగు డిఏలను వెంటనే మంజూరు చేయాలి. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కె శామ్యూల్, డి తియపతి నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షులు రామదాసు, జిల్లా కార్యదరి ఆర్ మాలకాండ నాయక్, సుభాకర్ రావు, జె వెంకటేశ్వర్లు, మురళీ, గాపాల్, ఆత్మానంద ప్రభాకర్, ఆంజనేయులు, కలాం, నర్సయ్య, సతీష్, ఈశ్వరమ్మ, పోలమ్మ, నాగలక్ష్మీ, ఎంజె ప్రసాద్, గోపాల్‌రెడ్డి, మస్తాన్, సాయిబాబా, మురళీమోహన్, గుల్సన్ బాషా, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.







## మంత్రుల పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జనవరి 30)

కందుకూరు పట్టణంలో శనివారం ఇద్దరు మంత్రులు పర్యటిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మియావాకి ప్రాజెక్టును మంత్రులు ప్రారంభించనున్నారు. ఒకేసారి వందల మంది విద్యార్థులతో మొక్కలు నాటిస్తారు. కాగా ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు గారు, మొక్కలను చూసి వివరాలు తెలుసుకున్నారు. స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు రూపుదుదిద్దుకుంటుంది. సేవా సమితి చైర్మన్ పువ్వాడి మౌనిక, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ రవికుమార్, సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా టిడ్కో కాలనీ వద్ద సిసి రోడ్డు శంకుస్థాపన, తర్వాత ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. చివరిగా టిఆర్ఆర్ కాలేజీలో కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక పోలీసులు, అధికారులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, నార్నె రోశయ్య చదలవాడ కొండయ్య, పువ్వాడి కోటయ్య, రాయపాటి శ్రీనివాసరావు, పొడపాటి మాధవ, భవనాసి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, మచ్చ మనోహర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 30)

మద్యం అక్రమ కేసులో సుదీర్ఘ కాలం పాటు జైల్లో ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి (గురువారం) బెయిల్ పై విడుదల కావడంతో శుక్రవారం ఒంగోలు వైసీపీ పార్లమెంట్ కార్యాలయంలో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మార్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు కేసుల పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చట్టపరంగా ఎదుర్కొందామని భరోసానిచ్చారు. ప్రజల పక్షాన, ప్రజల తరుపున చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులు ధీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీరామ్ సతీష్, పులి శ్రీనువాసులు, బొట్టు శ్రీనువాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీజి చూపిన ప్రేమ బాటను అనుసరిద్దాం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 30)

మహాత్మా గాంధీజి చూపిన ప్రేమ బాటను అనుసరించాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను అన్నారు. శుక్రవారం పొదిలి నగర పంచాయతీ పరిధిలోని పొదిలి 1వ సచివాలయం నందు గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజికి విగ్రహానికి టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, పోలేరమ్మ ఆలయ చైర్మన్ ముని శ్రీనివాసులు, పొదిలి ఏఎంసి డైరెక్టర్ సోమిశెట్టి శ్రీదేవి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెరీనా మాట్లాడుతూ గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టు వ్యాధి గ్రస్తుల పట్ల ఆయన చూపిన ప్రేమ, సేవ ఎనలేనిది అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా నేటి నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా వివక్షతను అంతం చేయడం గౌరవాన్ని కాపాడండి అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ, రాణి , ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.